క్లుప్తంగా

గుడ్డ సంచుల పంపిణీ


గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు

రాజాం: పట్టణంలో అమ్మవారి కాలనీ, ఆదర్శ నగర్ ప్రాంతాల్లోని సుందరం సత్యసాయి మందిరం వద్ద రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పట్టణ వాసులకు శుక్రవారం గుడ్డ సంచులు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు సీమకుర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా గుడ్డ సంచుల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు, రెడ్ క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్యకుమార్, రాజగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం ప్రారంభం


కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబీ నాయన

బొబ్బిలి: పరిశ్రమలు, కర్మాగారాల యాజమాన్యాలు ప్రజాప్రయోజనాల కోసం సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే బేబీ నాయన అన్నారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో హీరా మెల్ట్స్ కంపెనీ సౌజన్యంతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, హీరా కంపెనీ ఈడీ అశోక్ కుమార్ దాస్, హెచ్ఆర్ పి. శ్రీనివాసశర్మ, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు, హక్కులపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న పీఓ విజయలక్ష్మి

బొబ్బిలిరూరల్: కిశోరీ బాలికలు రక్షణ చట్టాలు, తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ పీఓ జె.విజయలక్ష్మి సూచించారు. కిశోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా అలజంగి గ్రామ అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరీ బాలికలకు శుక్రవారం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యాహక్కు, పోక్సో, బాల్యవివాహాల నిషేధం, తదితర చట్టాల గురించి, ఆరోగ్ జాగ్రత్తలను వివరించారు. బలవంతపు బాల్యవివాహాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బాల్యవివాహాల వల్ల మానసిక,శారీరక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు.వ్యక్తిత్వ వికాసం కలిగి ఉండాలని, సమాజంపై అవగాహన ఏర్పరుచుకోవాలని సూచించారు. రక్తహీనత సమస్యను అధిగమించేందుకు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు..అనంతరం యోగా ఆసనాలను వేయించారు.

కంపుకొడుతున్న పల్లెలు...!

- గ్రామాల్లో కానరాని పారిశుద్ధ్య నిర్వహణ
- స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు హడావిడి
- ఆచరణలో మాత్రం శూన్యం
- ఎక్కడపడితే అక్కడే చెత్త కుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలు
- వర్షాలు కురుస్తుండడంతో విజృంభిస్తున్న విషజ్వరాలు


రాజాం: గుయ్యానవలసలో రోడ్డు పక్కన చెత్తకుప్పలు


రాజాం: రాజాం పట్టణం శ్రీకాకుళం రోడ్డులో ప్రధాన రహదారిమీదుగా ప్రవహిస్తున్న మురుగునీరు

రాజాం/రామభద్రపురం:

ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టక పోవడంతో బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు గ్రామాలు చెత్తాచెదారంతో, మురు గుతో కంపుకొడుతున్నాయి. ఎక్కడపడితే అక్కడే మురుగు నీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. అధికారులు, ప్రజాప్రతిని ధులు మాత్రం ప్రతీ నెల మూడో శనివారం 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' అంటూ ర్యాలీలు నిర్వహిస్తునే ఉన్నారు. కానీ క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ, సమస్యలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. గ్రామాల్లో చెత్త నిల్వలు రోజురోజుకు పేరుకుపోతున్నాయి. ఏ గ్రామం చూసినా ఏముంది గర్వకారణం అంతా చెత్తా చెదారమే అన్న చందంగా తయారయ్యాయి. కొన్ని గ్రామాల్లో వీధి కాలువల్లో పూడిక తొలగించకపోవడం వల్ల మురుగునీరు ముందుకు సాగక రోడ్లపై ప్రవ హిస్తుండడంతో స్థానికులతో పాటు ఆమార్గాల్లో ప్రయాణించే వారికీ ఇబ్బందులు తప్పడం లేదు. కొంతమంది పారిశుద్ధ్య కార్మికులు చెత్తను గ్రామ శివారుల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించకుండా రోడ్ల పక్కనే పారబోస్తున్నారు. తాజాగా కురిసిన వర్షాలకు చెత్తకుప్పలు కుళ్లి పోయి దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారాయి. వీటికి తోడు తాగునీటి వనరుల క్లోరినేషన్, కాలువలు, వీధుల్లో బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణకు ఫాగింగ్ వంటి చర్యలు మొక్కుబడిగా చేస్తుండడంతో సమస్య తీవ్ర తరమవుతోంది..


రామభద్రపురం: పాడివానివలసలో తాగునీటి బోరు చుట్టూ నిలిచిన మురుగు

చర్యలు తీసుకుంటున్నాం..



గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. మురుగుకాలువల్లో చెత్తను తొలగించేందుకు పంచాయతీ నిధులు వినియోగిస్తున్నారు. పారిశుద్ధ్య పనుల నిమిత్తం ఏడాదికి నాలుగు పర్యాయాలు నిధులు విడుదలవుతున్నాయి. అన్ని గ్రామాల్లో చెత్తసేకరణ సజావుగా జరిగేలా చూస్తున్నాం.ప్రజల్లో చైతన్యం, అవగాహన లేక పోవడంతో కొన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం కనిపిస్తోంది.

– వి. శ్రీనివాసరావు, ఎంపీడీఓ, రాజాం మండలం.

నిర్లక్ష్యం వహించొద్దు..



గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహించవద్దని ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు సూచించాం.అలాగే మురుగు కాలువల్లో పూడిక తొలగించాలని, తాగు నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుద్ధిచేసేలా చర్యలు తీసుకుంటాం. అధికారులు, సిబ్బంది రోజుకో గ్రామం సందర్శించి పారిశుద్ధ్యం, మంచినీటి ట్యాంకుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టేలా చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌రావు, డీఎల్‌పీఓ

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

గ్రామాల్లో పేరుకు పోతున్న చెత్తకుప్పలు, ఎక్కడికక్కడ స్తంభించి పోతున్న మురుగునీరు వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు. వర్షాలు కూడా కురుస్తుండడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రారంభమయ్యాయి.రాజాం నియోజకవర్గంలో జ్వర పీడితులు రాజాంతో పాటు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్నారు. ఒక ఇంట్లో ఒక వ్యక్తికి జ్వరం ప్రబలితే ఆ ఇంట్లో మిగిలిన వారికి కూడా జ్వరం వ్యాప్తి చెందుతోంది. ప్రైవేట్ ఆస్పత్రిని ఆశ్రయిస్తే ఒక్కో వ్యక్తికి తక్కువలో తక్కువ రూ.2 వేల వరకూ వైద్య ఖర్చులు అవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఈ వర్షాకాలంలోనైనా అప్రమత్తంగా వ్యవహరించి, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


రాజాం: రేగిడి మండలం అంబఖండిలో ఓ వీధిలో స్తంభించిన మురుగునీరు


రాజాం: రాజాం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు


రామభద్రపురం: కొండకెంగువలో రోడ్డుపక్కన పేరుకు పోయిన చెత్త

కోళ్ల ఫారం తరలించాలని రిలే నిరాహార దీక్ష


రిలే నిరాహార దీక్ష చేస్తున్న బిరసాడవలస గ్రామస్తులు

మెంటాడ: జయితి పంచాయతీలోని గిరిజన గ్రామం బిరసాడవలసను ఆనుకుని ఉన్న కోళ్ల ఫారాన్ని జనవాసాలకు దూరంగా తరలించాలని డిమాండ్ చేస్తూ ఆగ్రామస్తులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ప్రారంభించిన రిలే నిరాహార దీక్షలను రెండో రోజు శుక్రవారం కొనసాగించారు. వైస్ ఎంపీపీ పొట్టంగి దుర్గ మాట్లాడుతూ కోళ్ల ఫారం నుంచి తీవ్ర దుర్గంధం వస్తోందని, ఈగలు వృద్ధి చెందడం వల్ల గ్రామస్తులు తరచూ రోగాల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిరసాడవలసతో పాటు చుట్టు పక్క 5 గ్రామాల ప్రజలకూ ఈ ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అధికారులు స్పందించి కోళ్ల ఫారాన్ని తరలించే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. సర్పంచ్ బెవర వీరునాయుడు, సీపీఎం నాయకులు రాకోటి రాములు, గిరిజన నాయకుడు ఈదుబిల్లి బోడయ్య, గ్రామస్తులు పొట్టంగి అచ్యుత్,తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీల సందర్శన

రాజాం: రాజీపేట, కంచరాం గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీల(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు)ను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. క్లాప్ మిత్రలకు ఆయన పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి చెత్తను సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాలని, అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయాలని సూచించారు. అలాగే కేంద్రాల వద్ద కూరగాయల సాగు, పండ్ల మొక్కల పెంపకం చేపట్టాలని చెప్పారు. ఆయన వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం

బొబ్బిలిరూరల్: గిరిజన గ్రామాల్లో ప్రజలు మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రఘువంశీ సూచించారు. సీహెచ్.బొడ్డవలస పంచాయతీ పరిధిలోని నిమ్మలపాడు, చెల్లివలస,కొయ్యికొండవలస తదితర గిరిజన గ్రామాల ప్రజల కోసం నిమ్మలపాడులో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు మలేరియా రక్తపరీక్షలు చేశారు. జ్వరపీడితులకు మందులు అందజేశారు. నిమ్మలపాడులో ఇంటింట సర్వే చేపట్టారు. గర్భిణుల వివరాలను నమోదుచేసి ఈనెల 9న పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సిఫార్సు చేశారు. సర్పంచ్ పి.వేలాంగిని, ఏఎన్ఎంలు,ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రఘువంశీ

అన్ని నిర్మాణాలపైనా పన్నులు వేయండి

బొబ్బిలి: ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న భవనాలతో పాటు ఇది వరకు ఉన్న భవన నిర్మాణాలన్నింటిపై వెంటనే పన్నులు వేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి మున్సిపల్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో అడ్మిన్ సెక్రటరీలు,వార్డు ప్లానర్లు,ఎమినిటీ సెక్రటరీలతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అండర్ అసెస్మెం ట్లు, ఆన్ అసెస్‌మెంట్లను వెంటనే గుర్తించాలన్నారు. గుర్తించిన వారికి పన్నులు ఎంత మేరకు చెల్లించాలో తెలియజేసి వివరించాలన్నారు. సెక్రటరీలు తమ వార్డుల పరిధిలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించాలని సూచించారు. ఇచ్చిన ప్లానింగ్ ప్రకారం నిర్మాణాలు జరుగుతున్నాయా? లేక అతిక్రమించారా అని పరిశీలించి వెంటనే తనకు సమాచారం ఇవ్వాలన్నారు. తాగునీటి వనరులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు.


సచివాలయ,మున్సిపల్ అధికారులు,సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

అభివృద్ధికి నిధుల సమీకరణ అవసరం


మున్సిపల్ నిధులపై ఆరా తీస్తున్న ఆర్‌డీ రవీంద్ర

బొబ్బిలి: మున్సిపాలిటీ అభివృద్ధికి నిధుల సమీకరణ అవసరమని, ఇందుకు ప్రాంతీయ స్థాయిలో ప్రయత్నం అవసరమని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ (ఆర్‌డీ) వి.రవీంద్ర అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. మున్సిపాలిటీలో అందుబాటులో ఉన్న నిధులు, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధుల గురించి ఆరా తీశారు. మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్,కమిషనర్ ఎల్.రామలక్ష్మి ద్వారా ఆర్థిక అవసరాలు తెలుసుకున్న ఆర్‌డీ రవీంద్ర అందుకు తగ్గట్టుగా నిధుల సమీకరణకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ డీఈఈ కిరణ్‌కుమార్,ఏఈ గుప్తా, పర్యావరణ ఇంజినీరు సోమేశ్వరరావు ఉన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం


ర్యాలీ చేస్తున్న డాక్టర్ అసిరినాయుడు, వైద్య సిబ్బంది

రేగిడి: పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి చందక అసిరినాయుడు అన్నారు.డయేరియా నిర్మూలనపై మండల కేంద్రంతో పాటు ఆమదాలవలస గ్రామాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడి ఆహార పదార్థాలు తినాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, రోడ్డు పక్కన లభించే ఫాస్ట్ ఫుడ్ తినొద్దని సూచించారు. సీహెచ్‌ఓ సుందరేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ కె.వి. అప్పారావు, హెచ్‌వీలు పుష్ప, జ్యోతి, ఎల్‌టీ రమణ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మోదీ మెప్పు కోసం కార్మికులను బలి చేస్తారా..?

బొబ్బిలి: ప్రధాని మోదీ మెప్పు కోసం కార్మికులను బలి చేస్తారా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు ప్రశ్నించారు. లేబర్ కోడ్ల రద్దులో భాగంగా పనిగంటలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం స్థానిక కోరాడ వీధి జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పని సమయాన్ని రోజుకు 8 గంటల నుంచి 12 గంటలకు పెంచడం కార్మికులను, వారి ఆరోగ్యాన్ని బలి చేయడమేనని, వెంటనే ఈనిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేట్ల మెప్పు కోసం ప్రధాని మోదీ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేస్తే.. వాటిని వ్యతిరే కించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తూ మంత్రి మండలి ద్వారా నిర్ణయం తీసుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇది కార్మికవర్గానికి తీవ్ర నష్టం కలిగించడమేనని, కార్మికుల జీవితాలను తాకట్టు పెట్టడమేనని మండిపడ్డారు. కార్పొరేట్లకు లాభాలు తెచ్చిపెట్టేందుకే చంద్రబాబు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆరో పించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జూలై 9న చేపట్టనున్న జాతీయ సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికుల యూనియన్ అధ్యక్షుడు జి.గౌరీష్, రామారావు, యుగంధర్, వెంకటి, జి.శంకరరావు, కార్మికులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

వైభవంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు


బాడంగి: తెంటువలస శివాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి


రాజాం: గార్రాజుచీపురుపల్లిలో పూజలు చేస్తున్న రుత్వికులు

రాజాం: మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలో అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వర స్వామి, నవగ్రహ దేవాలయాల ప్రతిష్ఠోత్సవా లు రెండో రోజు శుక్రవారం వైభవంగా జరిగాయి. జాడ సూర్యనారాయణశాస్త్రి, జాడ బాలచంద్రమౌళీశ్వర శర్మ, జాడ నాగఫణిశర్మతో పాటు గ్రామ పురోహితులు కర్రి వాసుదేవరావుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొ న్నారు.

తెంటువలసలో శివాలయ పునః ప్రతిష్ఠ

బాడంగి: మండలంలోని తెంటువలసలో శివాలయ పునః ప్రతిష్ఠోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాతశివాలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో కొత్తగా ఆలయాన్ని నిర్మించి శివలింగాన్ని ప్రతిష్ఠించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి గ్రామంతో పాటు చుట్టుపక్క గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు హాజరై అన్నప్రసాదం స్వీకరించారు.

కుంటి సాకులు చెబితే ప్రజలు నమ్మరు

- మేం మంజూరు చేసిన పనులు చేయడానికే మీపరిపాలనా సమయం చాలదు
- ఏ హామీలు అమలు నెరవేర్చారో చెప్పాలి
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బేబీ నాయనపై మాజీ ఎమ్మెల్యే శంబంగి ఫైర్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: ఎన్నికల సమయంలో కూటమి మేనిఫెస్టోతో సంబంధం లేకుండా గ్రామాల్లో వ్యక్తిగతంగా ఏం హామీలు ఇచ్చావో, అవి ఎంత వరకు అమలు పరిచావో ప్రజలకు చెప్పాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఎమ్మెల్యే బేబీ నాయనను ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది పాలనలో ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చకుండా, చేసింది చెప్పుకోవడానికి ఏమీ లేక నోటికొచ్చినట్టు మాట్లాడితే జనం నవ్విపోతారని, ఊరికే కుంటి సాకులు చెబితే ప్రజలు నమ్మే రోజులు ఇప్పుడు లేవని గుర్తించాలని బేబీ నాయనకు హితవు పలికారు. నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ హయాంలో తాము మంజూరు చేసిన పనులు చేయగా, మిగిలిన పనులు గ్రౌండ్ చేయాలంటేనే మీ పరిపాలనా కాలం సరిపోదని అన్నారు. బొబ్బిలి మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణం, పాఠశాలల అభివృద్ధి, తదితర ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు.అలాగే జైకా నిధులతో సాగునీటి వనరులకు సంబంధించి పనులు ప్రారంభమయ్యాయని, ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటైందన్నారు. తోటపల్లి పిల్ల కాలువల నిర్మాణానికి నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించామన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించామని, ఇండోర్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశామని గుర్తు చేశారు. నాలుగు మండలాలు, మున్సిపాలిటీలో ఎక్కడికి వెళ్లి అడిగినా వైఎస్సార్ సీపీ హయాంలో ఏం జరిగిందో చెబుతారన్నారు. గతంలో మంత్రిగా మీ అన్నయ్య, మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన తమరు ఏం చేశారో చెప్పాలని ఎమ్మెల్యే బేబీ నాయనను ప్రశ్నించారు.

వెన్నుపోటు దినం విజయవంతం

కూటమి ప్రభుత్వ పరిపాలనపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉండడం వల్లే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి ప్రజలు, కార్యకర్తల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించిందని శంబంగి స్పష్టం చేశారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో పాటు ప్రజలు స్వయంగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడం విశేషమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు నా వందనాలన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.వి. మురళీ కృష్ణారావు, తెర్లాం మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తెంటు సత్యం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నీ అనుయాయులకు అనుమతులు అవసరం లేదా..?

ప్రజలకు అవసరమైన పనులు, రహదారుల నిర్మాణానికి అన్ని రకాల అనుమతులు కావాలని చెబుతున్న బేబీ నాయన..తన పుణ్యాన అవిశ్వాస తీర్మానంతో మున్సిపల్ చైర్మన్ పీఠం స్వాధీ నం చేసుకున్న తర్వాత మున్సిపల్ చైర్మన్ చాంబర్‌కు సొగసులు అద్దేందుకు సిద్ధమయ్యారని, ఈ పనులకు నిధులు కేటాయించేందుకు ఎవరి అనుమతులు అక్కర్లేదా అని శంబంగి ప్రశ్నించారు. ఏదైనా పనులకు సంబంధించి వర్క్ ఆర్డర్లు ముఖ్యమని, ఇప్పుడు చేస్తున్న పనులకు సంబంధించి వర్క్ ఆర్డర్ ఎక్కడుందని , కనీసం అధికారులకు కూడా ఈ విషయం తెలియదా అని నిలదీశారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు


తెర్లాం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ- 2 పాపారావు


బాడంగి: విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


రామభద్రపురం: పోటీల్లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాల్లో 40 రోజుల పాటు సాగిన వేసవి విజ్ఞా న శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. లైబ్రేరియన్ల ఆధ్వర్యంలో చిత్రలేఖనం, పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, కథలు రాయడం, చెప్పడం, వివిధ ఆటలు, యోగా, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆటలు, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు శిబిరాల ముగింపు సందర్భంగా మండల అధికారులు, ఎంఈఓలు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

– తెర్లాం/బాడంగి/ రామభద్రపురం

రాజాం తహసీల్దార్‌గా రాజశేఖర్



రాజాం: మండల తహసీల్దార్‌గా ఎం.రాజశేఖర్ నియమితులయ్యారు. శ్రీకాకుళం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఈయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఎస్.కె. రాజుకు జామి మండలం బదిలీ అయ్యిందని తహసీల్దార్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.